క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

చాగల్లు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. చాగల్లు, నెలటూరు, మీనానగరం గ్రామల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పల్లంట్ల వ్యవసాయ ఫీడర్‌కు ..

దేవరపల్లి: పల్లంట్ల 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పల్లంట్ల వ్యవసాయ ఫీడర్‌కు శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్. నారాయణ అప్పారావు తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. త్రీ ఫేజ్ సరఫరా ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1గంట నుంచి 3 గంటల వరకు ఉంటుందన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



తాడిమళ్ల సచివాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

నిడదవోలు రూరల్: సచివాలయ సిబ్బంది మనోభావాలు దెబ్బతీసేలా కొంతమంది కూటమి నాయకుల వ్యవహారశైలి ఉందని సచివాలయ ఉద్యోగులు అన్నారు. విశాఖపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సచివాలయ వ్యవస్థపై అవగాహన లేకుండా కార్పొరేటర్ మాట్లాడడాన్ని వ్యతిరేకిస్తూ మండలంలోని తాడిమళ్ల సచివాలయ ఉద్యోగులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ సచివాలయ సిబ్బందికి క్షమాపణ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



ఆశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

దేవరపల్లి: కృష్ణంపాలెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వయోవృద్ధుల ఆశ్రమంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆశ్రమం వ్యవస్థాపకురాలు జి. శ్యామలాదేవి ఏర్పాటు చేసిన వేడుకల్లో పలువురు పాస్టర్లు, రాజకీయ నాయకులు, గ్రామస్తులు, వృద్ధులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. భూపతిరాజు విద్యాసంస్థల కరస్పాండెంట్ డి. సువర్ణరాజు, ఫాదర్ అద్దంకి రాజాయోనా క్రిస్మస్ కేక్‌కట్ చేశారు. వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు కడలి హైమావతి, ఫాదర్ డేవిడ్ ఫ్రాన్సిస్, జోగల శ్యామ్‌సుందర్, వసంతాడ ఆనంద స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం సర్పంచ్ శిరీష వివాహం

హాజరైన మాజీ మంత్రి వనిత



సర్పంచ్ పైడి శిరీషను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: గోపాలపురం సర్పంచ్ పైడి శిరీష వివాహానికి మాజీ హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత శుక్రవారం హాజరై ఆమెను దీవించారు. చిన్న వయసులో సర్పంచ్‌గా మేజర్ పంచాయతీ ప్రజలకు శిరీష సేవలు చేయడం అభినందనీయమన్నారు. మాజీ మంత్రి వెంట ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, గోపాలపురం ఉప సర్పంచ్ ముల్లంగి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఉచితంగా వైద్య పరీక్షలు

తాళ్లపూడి: తమ ఆసుపత్రిలో ఉచిత ఓపీ సౌకర్యం కల్పిస్తున్నట్టు తాళ్లపూడిలోని ఆర్ ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు రవికుమార్‌రెడ్డి శుక్రవారం చెప్పారు. ఆసుపత్రి ఐదో వార్షికోత్సవాన్ని, తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఆసుపత్రిలో నగదు సేవలన్నింటిలోనూ 10 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. మందుల విక్రయాలు, పరీక్షలకు కూడా ఈ తగ్గింపు వర్తిస్తుందని తెలిపారు.

ఊరూ వాడా.. క్రిస్మస్ సందడి

- చర్చిలు, గృహాల వద్ద క్రిస్మస్ కాంతులు
- క్రీస్తు జనన వృత్తాంత నాటికల ప్రదర్శనకు యువత సాధన
- జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు

నిడదవోలు: క్రిస్మస్ సందడి మొదలైంది. కొవ్వూరు డివిజన్‌లోని నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో క్రైస్తవ మందిరాలు, విశ్వాసుల గృహాలు నూతనత్వాని సంతరించుకున్నాయి. సత్యం, శాంతి, కరుణ, త్యాగం, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశాలతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. త్యాగానికి ప్రతీక అయిన క్రిస్మస్ వేడుకను ఈనెల 25న జరుపుకునేందుకు క్రైస్తవులు సన్నద్ధం అవుతున్నారు.ఈ క్రమంలో డిసెంబర్ నెల ప్రారంభం నుంచే క్రైస్తవుల ఇళ్లు, ప్రార్థనా మందిరాలు, వీధుల్లో స్టార్స్ ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ క్రైస్తవులు ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు, సెమీ క్రిస్మస్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. చర్చిలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూనే 25నాటి క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మరోపక్క క్రైసవులు తమ గృహాలను సుందరంగా అలంకరిస్తున్నారు.



నిడదవోలు టౌన్ లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన ఆరు అడుగుల క్రిస్మస్ స్టార్



మార్కెట్‌లో విక్రయిస్తున్న క్రిస్మస్ స్టార్స్, అలంకరణ సామగ్రి

జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు

నిడదవోలు పట్టణంలో క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, చర్చిల అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల మోడళ్లలో, రేట్లలో ఇవి లభిస్తున్నాయి. కాగితం, ప్లాస్టిక్‌తో పాటు ఎలక్ట్రికల్ స్టార్లు సైతం మార్కెట్‌లో లభిస్తున్నాయి. స్టార్లు రూ.10 నుంచి రూ.600 రేటుకు, కాగితాలు, ఎలక్ట్రికల్‌తో తయారు చేసిన స్టార్లు రూ.100 నుంచి రూ.వెయ్యి రేటుకు అందుబాటులో ఉన్నాయి. క్రిస్మస్ ట్రీలు సైజు, నాణ్యతను బట్టి రూ.20 నుంచి రూ.8 వేలకు విక్రయిస్తున్నారు. చర్చిలలో సండే స్కూల్ పిల్లలు, యువజనులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే నాటికలు, నృత్యాలు సాధన చేస్తున్నారు. క్రిస్మస్‌నాడు ప్రత్యేక సువార్త గీతాలు ఆలపించేదుకు క్రైస్తవ యువత ప్రాక్టీస్ చేస్తోంది.

ప్రారంభమైన వేడుకలు

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెలంతా నాటికలు, క్యాండిల్ సర్వీసు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు.ఇప్పటికే కొన్నిచోట్ల యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు. క్రీస్తు పుట్టుకను వివరిస్తూ పశువుల పాకలను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. గృహాలు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగులు ఏర్పాటు చేస్తున్నారు. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని మననం చేసుకుంటూ క్రైస్తవులు గ్రామాల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు.మరికొన్ని చోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

హనుమద్వ్రత వార్షికోత్సవాలు ప్రారంభం



దేవరపల్లిలో 108 కలశాలతో ఆలయాల సందర్శన చేస్తున్న భక్తులు

దేవరపల్లి: స్థానిక గోపాలపురం రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్వ్రత వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు ఈ నెల 17 వరకూ కొనసాగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం 108 కలశాల గోదావరి జలాలతో భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని పలు ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం అభయ ఆంజనేయస్వామి వారికి 108 కలశాల పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. లక్ష్మీవ్రతం, నూతన గృహప్రాప్తికి, ఇష్ట కార్యసిద్ధికి హనుమత్ వ్రత మంగళహారతి నిర్వహించారు.

చాగల్లులో లక్ష తమలపాకుల పూజ



తమలపాకుల అలంకరణలో చాగల్లు అంజనేయస్వామి

చాగల్లు: స్థానిక మెయిన్ రోడ్డులోని భక్తాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి హనుమత్ వ్రత మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారికి శుక్రవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి శివ సీతారామశర్మ పూజలు నిర్వహించారు.

అన్నదాతకు దన్నుగా చలో రాజమహేంద్రవరం

తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొవ్వూరు: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ శుక్రవారం వైఎస్సార్ సీపీ చలో రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించింది. రైతు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించేందుకు కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు రాజమహేంద్రవరం తరలి వెళ్లాయి. రాజమహేంద్రవరం రూరల్ పార్టీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగిన నిరసన ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కొవ్వూరు మండలశాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, తోట నారాయణ, పరిమి సోమరాజు, వెంపాటి సురేష్, మల్లిపూడి రాజేష్ తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

నిడదవోలు రూరల్: రైతు సమస్యలను పరిష్కరించాలంటూ వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు నిడదవోలు మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, రైతులు శుక్రవారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. కోరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు, నాయకులు సిరిమళ్ల దుర్గారావు, మానుకొండ చంద్రబాబు, నాగిరెడ్డి సత్తిపండు తదితరులు వెళ్లారు.

పెరవలి: రైతే వెన్నుముక అనే ప్రకటనలు తప్ప కూటమి ప్రభుత్వం గత ఆరు నెలల్లో రైతులకు చేసిన మేలు ఏమీ లేదని పెరవలి ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. అన్నదాతకు అండగా రాజమహేంద్రవరం కార్యక్రమంలో పాల్గొనేందుకు పెరవలి నుంచి శుక్రవారం పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు బయలుదేరి వెళ్లారు. ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, గండేపల్లి రామకృష్ణ, సన్నీ తదితరులు వెళ్లిన వారిలో ఉన్నారు.



పెరవలి నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ శ్రేణులు

నీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం



యర్నగూడెంలోని గండి చెరువు

దేవరపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని ఐదు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందుకోసం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. దుద్దుకూరు, యర్నగూడెం, సంగాయగూడెం, యాదవోలు, త్యాజంపూడి సాగునీటి చెరువుల సంఘాల ఎన్నికలకు ఆయా గ్రామాల జెడ్పీ హైస్కూళ్లలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దుద్దుకూరు ఊర చెరువు నీటి సంఘానికి, యర్నగూడెం గండి చెరువు నీటి సంఘానికి, సంగాయగూడెం పానకాల చెరువు నీటి సంఘానికి, యాదవోలు కనకమ్మ చెరువు నీటి సంఘానికి, త్యాజంపూడి ఆవ చెరువు నీటి సంఘానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలో 1720 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1122 మంది పురుషులు, 598 మంది స్త్రీలు ఉన్నట్టు వివరించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన శిక్షణ

కొవ్వూరు/ఉండ్రాజవరం/గోపాలపురం/తాళ్లపూడి: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల పరిషత్ కార్యాలయాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. కొవ్వూరులో ఎంపీడీవో కె.సుశీల ఆధ్వర్యంలోను, ఉండ్రాజవరంలో ఎంపీడీవో వి.రామారావు, ఈవోపీఆర్డీ అంజనేయశర్మ ఆధ్వర్యంలోను, గోపాలపురంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలోను, తాళ్లపూడిలో ఎంపీడీవో టీబీ వెంకటరమణ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు జరిగాయి. వివిధ అంశాలపై మండల స్థాయి ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపండి

మండల సమావేశంలో ఎంపీడీఓ సింహాద్రి

నల్లజర్ల: పదిహేనో ఆర్థిక సంఘ నిధులతో గ్రామ పంచాయతీల్లో చేపట్టే పనులను గుర్తించి ప్లాన్ అప్రూవల్ పంపిస్తే వాటిని గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని ఎంపీడీఓ సింహాద్రి అన్నారు. నల్లజర్ల మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. అధికారులతో పాటు సభ్యులు కూడా నామమాత్రంగా హాజరయ్యారు. దాంతో దాదాపు రెండు గంటల ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. అభివృద్ధి పనులపై చర్చ జరగకుండానే సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఆవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ మాట్లాడుతూ గత మూడేళ్లలో ఒక్క రూపాయి కూడ తమ పంచాయతీ అభివృద్ధికి కేటాయించలేదని ఆవేదన వెలిబుచ్చారు. తాము ఇక్కడ ప్రతిపక్షంలో ఉన్నా నిధులిస్తే తీర్మానాలు ఇవ్వడానికి సిద్ధమన్నారు. అదే రీతిలో సింగరాజుపాలెం సర్పంచ్ గద్దే తిలక్ తమకు కూడా నిధులు కేటాయించలేదన్నారు. అందుకు అదే గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి అభ్యంతరం తెలిపారు. గతంలో రెండుసార్లు నిధులు కేటాయిస్తే పంచాయతీ తీర్మానాలు ఇవ్వకుండ పనులను అడ్డుకొన్నారన్నారు. ఇపుడు నిధులు కేటాయించలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని తిలక్‌ను ఎద్దేవా చేశారు. నల్లజర్ల, ముసుళ్లగుంట, నబీపేట సర్పంచులు పల్లి జ్యోతి, నందమూరి శారదాదేవి, గోతం సత్యలక్ష్మి తమ పరిధిలోని వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయం, గ్రామీణ నీటిసరఫరా విభాగం, పీఆర్ ఏఈ, ఐసీడీఎస్, ఉపాధిహామీ, ఉద్యానవన శాఖ, గృహ నిర్మాణ శాఖ అధికారులు కమల్‌రాజ్, అజయ్ బాబు, పవన్, వెంకటలక్ష్మి, బబిత, శివ తదితరులు తమ శాఖల నివేదికలను సభకు సమర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్ ఏఈ పవన్

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత
- పలు గ్రామాల్లో అర్జీలు స్వీకరించిన రెవెన్యూ అధికారులు

నిడదవోలు రూరల్: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సమిశ్రగూడెంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. సదస్సుకు 21 అర్జీలు వచ్చాయి. పలువురు పాస్‌బుక్‌లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎంపీడీవో డి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ సత్యేంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని తీపర్రు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసదస్సులో ఐదు అర్జీలు అందాయని తహసీల్దార్ డి. అచ్యుత కుమారి తెలిపారు. నిర్దేశిత గడువులోగా వాటిని పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పావని, మండల సర్వేయర్ శేషుకుమార్, రైతులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: కాల్దారి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు ఫిర్యాదులు అందాయని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ తెలిపారు. వాటిలో వాటిలో ఒక ఫిర్యాదును అక్కడికక్కడే పరిష్కరించామని చెప్పారు.

దేవరపల్లి: మండలంలోని చిన్నాయగూడెం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తొమ్మిది అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ఎస్సై వి. సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి రాణి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని చిట్యాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. తమ పంట పొలాల దారులు ఆక్రమణలకు గురయ్యాయంటూ రైతులు తహసీల్దార్ కె. అజయ్‌బాబుకు ఫిర్యాదు చేశారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు.



సమిశ్రగూడెం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

నల్లజర్ల: పోతవరం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ వివాదాలపై 15 అర్జీలు అందాయి. తమ భూములకు పాస్‌బుక్‌లు అందించాలని, తమ భూమిని 22-ఏలో ఉంచారని, భూమి విస్తీర్ణంలో లోపాలు ఉన్నందున సర్వే చేసి లోపాలు న్యాయం చేయాలంటూ రైతులు తహసీల్దార్ కృష్ణారావును కోరారు. డిప్యూటీ తహసీల్దార్ శాంతి ప్రియ, వీఆర్వో సురేష్ పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఒక ఫిర్యాదు వచ్చిందని తహసీల్దార్ ఎం.మెరికమ్మ తెలిపారు. రైస్‌మిల్లర్ల సంఘ నాయకులు గారపాటి బాబురావు, ఆళ్ల హరిబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలోని గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతులు 8 వినతులు అందజేసినట్టు తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ మోహన భారతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు సంజీవరావు, నాగేశ్వరరావు, సుజాత, లీల, సిబ్బంది పాల్గొన్నారు.